ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 292
పేజీలు : 5 వెల రూ. 2/-
శుక్రవారం
20 ఫిబ్రవరి 2026
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## మంత్రుల అవినీతి చిట్టా బయటపెడతాం: బండి



ఏఎం న్యూస్, హైదరాబాద్,ఫిబ్రవరి19: మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల చెంపచెల్లుమనిపించామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ బరితెగించి కాంగ్రెస్‌తో కుమ్మక్కైందని విమర్శించారు. భాజపాను అడ్డుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ కుమ్మక్కయ్యాయి. మజ్లిస్ కోసమే భాగ్యనగరాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మూడు ముక్కలు చేశారు. రూ.2.18 లక్షల కోట్ల పెట్టుబడులు ఎక్కడికి పోయాయి. దిల్లీకి మూటలు పంపేందుకే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఒక్కో మంత్రి అవినీతి చిట్టా బయటపెడతాం. అవినీతికి సంబంధించిన ఆడియో రికార్డులు మా వద్ద ఉన్నాయి. 2029లో ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉండదని బండి సంజయ్ అన్నారు.

### మన ఆలోచనలకు
## అందనంతగా ఎఐ..

మానవ అభివృద్ధిలో ఎఐది కీలక భూమిక
భారత్‌లో ఎఐ పురోభివృద్ధి చరిత్రగా నిలుస్తుంది
ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ప్రధాని మోడీ



2 లో

### ప్రజల తెలంగాణ
# లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణ

- సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, ప్రతి పౌరుడికి న్యాయం
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై సిఎం, మంత్రులకు అభినందన
- తెలంగాణ కాంగ్రెస్ నేతల సమావేశంపై ఎక్స్ వేదికగా ఖర్గే వెల్లడి
- కాంగ్రెస్ అగ్రనేతలతో రెండుగంటలపాటు సిఎం, మంత్రుల భేటీ
- మేడారం జాతర నిర్వంచినందుకు మంత్రి సీతక్కకు ప్రత్యేక అభినందనలు

2 లో



## ఉచిత పథకాలపై మరోమారు సుప్రీం సీరియస్

- ప్రజల సొమ్మును దుబారా చేయడంపై ఆగ్రహం
- పేదలకు విద్య తదితర కనీస అవసరాలు కల్పించాల్సిందే
- చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వ్యాఖ్యలు



2 లో

## 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

- తొలిరోజు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం..
- 28న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి..



2 లో

# ప్రజాతీర్పును కాలరాస్తున్న కాంగ్రెస్

- పోస్టింగ్‌ల కోసం పోలీసుల తొత్తు వ్యవహారాలు
- క్యాతన్‌పల్లిలో బలమున్నా మంత్రి వివేక్ దుర్మార్గం
- వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే.. అప్పుడు చూపిస్తాం
- మీడియాతో హరీష్ రావు వ్యాఖ్య.. జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ



2 లో

## వచ్చే మేలో పార్టీని ప్రకటిస్తా

- ప్రధాన ప్రతిపక్షంగా ఎదుగుతాం
- అధికారంలోకి రావడం ఖాయం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



2 లో

# ప్రజల తెలంగాణ లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణ





ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,ఫిబ్రవరి19:
సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, 'ప్రజల తెలంగాణ' లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణను రూపొందించినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, ప్రతి పౌరుడికి న్యాయం అందించడం తమ ప్రధాన సంకల్పమని ఆయన వెల్లడించారు. ఢిల్లీలోని మల్లికార్జున ఖర్గే నివాసంలో తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించిన కీలక సమీక్ష సమావేశం జరిగింది. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, దామోదర రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్ట్, పార్టీ ప్రస్తుత పరిస్థితులు, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది.సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందించారు. ముఖ్యంగా తెలంగాణ మున్సిపల్ ,స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘనవిజయం నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మల్లికార్జున ఖర్గే తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించిందని, రాష్ట్ర నాయకులు, మంత్రులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా తదుపరి కార్యాచరణపై చర్చించామని, సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం అనే లక్ష్యాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఆకాంక్షలను సాకారం చేస్తూ సమగ్ర తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. సుమారు 2 గంటలపాటు భేటీ కొనసాగింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. సీఎం, మంత్రులు, నాయకులతో సమగ్ర సమీక్ష నిర్వహించాం. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం చేయడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం అని ఖర్గే పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేడారం జాతరను ఘనంగా నిర్వహించినందుకు మంత్రి సీతక్కను కాంగ్రెస్ అగ్రనేతలు అభినందించారు. ఆదివాసీల అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరపై సుమారు పది నిమిషాల పాటు చర్చ జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ.. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్త్యం గురించి మంత్రి సీతక్కను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క-సారలమ్మల పోరాట గాథను ఖర్గే, రాహుల్ ఆసక్తిగా విన్నారు. సమ్మక్క ? సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా చాటేందుకు సినిమా తీయాలని రాహుల్ గాంధీ సూచించారు. పార్టీ సమావేశంలో మంత్రి సీతక్క, రాహుల్ గాంధీ మధ్య సరదా సంభాషణ జరిగింది. మేడారం జాతరకు ఆహ్వానిస్తే తాము తప్పకుండా హాజరయ్యేవారమని రాహుల్ గాంధీ అన్నారు. 'ఆహ్వానిస్తే తాను కూడా తల్లుల దర్శనానికి వచ్చే వాడిని' అని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. అయితే సమయాభావం వల్ల వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు మంత్రి సీతక్క వివరించారు. వచ్చే జాతరకు తప్పకుండా అధికారిక ఆహ్వానం అందిస్తామని సీతక్క అన్నారు. 'ఆహ్వానం అందితే తప్పకుండా వస్తాము' అని రాహుల్ గాంధీ, ఖర్గే హామీ ఇచ్చారు.

# మన ఆలోచనలకు అందనంతగా ఎఐ



ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,ఫిబ్రవరి19:
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం మన ఆలోచనలకు అందనంత దూరంలో ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా, పునఃసమీక్షించేలా ఉండాలని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' లో గురువారం ప్రధాని ప్రసంగించారు. మానవ అభివృద్ధిలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని ప్రధాని తెలిపారు. మేకిన్ ఇండియా, భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు చాటుతోందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఆరోవంతు జనాభా భారత్‌లోనే ఉందని, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోందని చెప్పారు. కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంలో దేశ యువత ఆసక్తి కనబరుస్తోందని తెలిపారు. భారత్‌లో ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుందన్నారు. కృత్రిమ మేధకు పరివర్తన శక్తి ఉందని ప్రధాని చెప్పారు. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుందని, అదే సద్వినియోగం చేసుకుంటే పరిష్కారాలు చూపుతుందని అన్నారు. మనుషులు, సాంకేతికత కలిసి అభివృద్ధి పయనం సాగించే శకంలో మనం ఉన్నామని తెలిపారు. భవిష్యత్తులో ఏఐ ఏం చేయగలదో కాదు.. ప్రస్తుతం కృత్రిమ మేధను ఉపయోగించి మనం ఏం చేయగలమనేదే అసలు ప్రశ్న అని అన్నారు. ప్రజా సంక్షేమం, శ్రేయస్సే ఏఐకి మన బెంచ్‌మార్క్‌లు అని, మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం అవ్వాలని ప్రధాని అన్నారు. కృత్రిమ మేధ మనలను శాసించకూడదని, మనమే ఏఐని శాసించాలని మోదీ చెప్పారు. కృత్రిమ మేధ వినియోగంలో 'మానవ్ విజన్' ఉండాలని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్ అని ఆయన వివరించారు.

# ప్రజాతీర్పును కాలరాస్తున్న కాంగ్రెస్

ఏఎం న్యూస్, ఆదిలాబాద్,ఫిబ్రవరి19:
ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ అడుగులకు మడుగులు ఒత్తుతున్న పోలీసుల అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, వదిలి పెట్టబోమని హెచ్చరించారు. ఆదిలాబాద్ జైలులో ఉన్న మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ ను గురువారం పరామర్శించారు. అనంతరం జైలు బయట హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. క్యాతనపల్లి మున్సిపల్‌లో 22 స్థానాలకు గాను 14 స్థానాలను బీఆర్ఎస్ గెలిస్తే, ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరించకుండా, చైర్మన్ ఎన్నిక రోజు కావాలనే పోలీసు బందోబస్తు లేకుండా చేసి, చైర్మన్ ఎన్నిక జరగకుండా వాయిదా పడేలా చేశారని ఆరోపించారు. అధికారులు, పోలీసుల సమక్షంలో, మంత్రి వివేక్ చూస్తుండగానే దళిత, గిరిజన, మహిళా కౌన్సిలర్లపై దౌర్జన్యంగా, అసభ్యంగా ప్రవర్తించారని విమర్శించారు. బాల్క సుమన్, కోవ లక్ష్మిలను లోపలికి పంపించకుండా కేవలం కాంగ్రెస్ మంత్రిని ఎలా పంపిస్తారని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకులపై దాడి చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులే దాడులు చేశారంటూ పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి బాల్క సుమన్‌ను అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాతన్‌పల్లి, జనగామ, ఇబ్రహీంపట్నం, ఆమనగల్‌లో బీఆర్ఎస్ నాయకులను, కౌన్సిలర్లను పోలీసు బలగాలతో భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. జనగామలో ఓటింగ్ కోసం బీఆర్ఎస్ కౌన్సిలర్ చేతి పైకెత్తితే, వెనుక నుంచి కాంగ్రెస్ కౌన్సిలర్లు చేతులు పట్టి లాగి బెదిరించే ప్రయత్నం చేశారని, అందులో దళిత మహిళ చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో తమ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నా ఎన్నికను అడ్డుకునే ప్రయత్నం చేశారని, అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మెజారిటీ ఉన్నా గాని తాము అరాచకానికి పాల్పడలేదని వెల్లడించారు. బాల్క సుమన్‌ను వెంటనే విడుదల చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ నేతలే పథకం ప్రకారం దాడి చేసి బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. బలం లేని చోట కాంగ్రెస్ ఎలా గెలుస్తుందో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.మంత్రి వివేక్ వెంకటస్వామి తీరు జుగుప్సాకరంగా ఉందని హరీశ్ విమర్శించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టింగ్‌ల కోసం బీఆర్ఎస్ నేతలను వేధిస్తే ఊరుకునేది లేదని.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక తగిన మూల్యం చెల్లించుకుంటారని పోలీసులను మాజీ మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల తిరుగుబాటు మొదలైందన్నారు. 'రాహుల్ గాంధీ.. మీ రాజ్యాంగం ఏమైందో చెప్పాలి' అని డిమాండ్ చేశారు. క్యాతనపల్లి ఇన్సిడెంట్‌పై గవర్నర్ రిపోర్ట్ తెప్పించుకోవాలని హరీశ్ రావు కోరారు. 'వినాశకాలే విపరీత బుద్ధి.. పోలీసులూ తస్మాత్ జాగ్రత్త' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు వార్నింగ్ ఇచ్చారు. కాగా, జైల్లో ఉన్న బాల్కసుమన్‌ను హరీశ్ రావుతో పాటు ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, మాజీ మంత్రి రామన్న పరామర్శించారు.

# 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

ఏఎం న్యూస్, హైదరాబాద్,ఫిబ్రవరి 19:
తెలంగాణ అసెంబ్లీ బ్జడెట్ సమావేశాల తేదీ ఖరారైంది. ఈనెల 26 నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఫిబ్రవరి 28న అసెంబ్లీలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. సారి సభను 10 నుంచి 15 రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ రూపకల్పనపై సర్కార్ కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా ప్రీ బ్జడెట్ సమావేశాలను పూర్తి చేశారు. అన్ని శాఖల మంత్రులు, అధికారులతో మంత్రి భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహించారు. ఈసారి బ్జడెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. రైతు సంక్షేమం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. కొత్త సంక్షేమ పథకాలు, నీటిపారుదల, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి వంటి అంశాలపైనా ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో పెన్షన్ల విషయంలో కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఇక, ఈనెల 23న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్‌లో బ్జడెట్ సమావేశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# వచ్చే మేలో పార్టీని ప్రకటిస్తా

ఏఎం న్యూస్, హైదరాబాద్,ఫిబ్రవరి 19:
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు చేశారు. మే నెల మొదటి వారంలో మంచి రోజు చూసుకుని పార్టీని అధికారికంగా ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. పార్టీ పేరులో 'తెలంగాణ' అనే పదం తప్పనిసరిగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తన మొదటి ఛాయిస్ సిద్దిపేట అని, రెండో ఛాయిస్ బోధన్ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ఉండదని, ప్రధాన ప్రతిపక్షంగా తామే అవుతామని కవిత ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తామే వస్తామని, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తోందని, కొత్త తరహా రాజకీయం చేయడం లేదని విమర్శించారు. తన పార్టీ వ్యక్తుల మీద కాకుండా వ్యవస్థల మీద నడవాలన్నారు. ప్రాంతీయ పార్టీలు లీడర్ సెంట్రిక్‌గా ఉంటాయని.. కానీ వ్యవస్థ నిర్మాణం జరగాలని,సైద్ధాంతిక పునాది ఉండాలని అన్నారు. మహిళలను అవమానించవద్దన్నారు కవిత. వైఎస్ షర్మిలా రెడ్డి నేడు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారని.. కానీ, షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ప్రజలకు నచ్చలేదని తెలిపారు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా అని ప్రశ్నించారు. 'నా లైన్‌లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది' అని అన్నారు. తెలంగాణ వాదమే తమ పార్టీ మొదటి లైన్ అని తేల్చిచెప్పారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చినవారు కేంద్ర మంత్రులు అయ్యారని చెప్పుకొచ్చారు. కొత్త తరానికి తాను పెట్టబోయే పార్టీలో అవకాశాలు ఉంటాయని కవిత పేర్కొన్నారు.

## ఉచిత పథకాలపై
# మరోమారు సుప్రీం సీరియస్

ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,ఫిబ్రవరి 19:
దేశంలో రాజకీయ పార్టీలు అందిస్తున్న ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్రస్థాయిలో స్పందించింది. తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశ మయ్యాయి. ఉచిత పథకాల వల్ల దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుందని కోర్టు హెచ్చరించింది. తమిళనాడులో ఉచిత విద్యుత్ సరఫరా, ఆర్థిక స్థితిగతులపై విచారణ చేపట్టిన కోర్టు, విద్యుత్ పంపిణీ సంస్థకు నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయో వివరించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. పేదలకు విద్య, కనీస అవసరాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కోర్టు అంగీకరించింది. అయితే, పెద్ద పెద్ద భూస్వాములకు కూడా ఉచిత విద్యుత్ అందించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. 'సౌకర్యం కావాలనుకున్నప్పుడు డబ్బులు చెల్లించాలి కదా! పెద్ద భూస్వాములు ఉచితం అని అనవసరంగా లైట్లు, మెషీన్లు వాడుతున్నారు' అని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందే ఉచిత పథకాలను ప్రకటించే సంస్కృతిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు, సామాజికవేత్తలు తమ సిద్ధాంతాలను పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికింది. ప్రభుత్వం ఇచ్చే ఉచితాల వెనుక ఉన్నది ప్రజల కష్టార్జితమైన పన్నుల సొమ్ము అని కోర్టు గుర్తు చేసింది. రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నప్పటికీ ఉచిత పథకాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. రాష్ట్రాలు వసూలు చేసే ఆదాయంలో కనీసం 25 శాతాన్ని రాష్ట్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎందుకు ఉపయోగించకూడదని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, 'ఉచితాలు ఎన్నాళ్లు కొనసాగుతాయి?' అన్న సుప్రీంకోర్టు ప్రశ్న ఇప్పుడు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారింది. సంక్షేమం పేరుతో ఆర్థిక క్రమశిక్షణను విస్మరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని అత్యున్నత న్యాయస్థానం పరోక్షంగా హెచ్చరించింది.

# ఆరు గ్యారెంటీలు సహా హామీలపై స్పష్టత ఇవ్వాలి

### ఈ బడ్జెట్‌లో కేటాయింపులతో నిజాయితీ చాటాలి
### సిఎం రేవంత్‌కు కెటిఆర్ లేఖ

ఏఎం న్యూస్, హైదరాబాద్,ఫిబ్రవరి 19:
ఆరు గ్యారెంటీల పేర్లు చెప్పి అధికారంలోకి వచ్చి వాటి అమలను పక్కన పెట్టారని, ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆరు గ్యారెంటీలో హామీ ఇచ్చిన మహిళలు, వృద్ధులు, విద్యార్థి, యువత, రైతన్నల కోసం భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చిన మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలని కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగలేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు సగం కాలం పూర్తవుతున్నా ,ఇప్పటికీ హామీల్లో 95 శాతం పెండింగ్‌లోనే ఉన్నాయని ఆరోపించారు. ఈ సారైన బ్జడెట్ లో కేటాయింపులు చేయాలని లేనిపక్షంలో తెలంగాణ సమాజం ఇంకా ఓపికపట్టే ప్రసక్తే లేదని గుర్తుచేశారు. ఆయా వర్గాలకు రెండు సంవత్సరాలుగా ఎగ్గొట్టిన హామీలను, కాంగ్రెస్ ఇస్తామని చెప్పిన నిధుల బకాయిలకు ఈ బడ్జెట్లో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దాని నిలబెట్టుకోవాలన్నారు. ఈసారి కూడా హామీల అమలకు నిధులు కేటాయించకుంటే ప్రజల తరఫున ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొస్తామని, మోసకారి కాంగ్రెస్‌ను ప్రజలపక్షాన నిలదీస్తామని హెచ్చరించారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఈ తరుణంలో 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మీరిచ్చిన హామీల గురించి తెలంగాణ ప్రజల పక్షాన గుర్తుచేసేందుకే ఈ లేఖ రాస్తున్నానని వెల్లడించారు. తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరిట మభ్యపెట్టి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ అమలుకు నోచుకోని నేపథ్యంలో, కనీసం ఈ సారి బ్జడెట్ లోనైనా అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ నాలుగు కోట్ల ప్రజల పక్షాన మిమ్మల్ని కోరుతున్నానని అన్నారు. వృద్ధులు, వితంతువులకు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్‌ను నాలుగు వేలకు పెంచడానికి ఎన్ని నిధులు కావాలో లెక్కగట్టి ప్రతి పైసాను ఈ సారి బడ్జెట్‌లో కేటాయించాల్సిన బాధ్యత మీపై ఉంది. అలాగే రాష్ట్ర జనాభాలో సగభాగంగా ఉన్న ప్రతి ఒక్క మహిళకు మహాలక్ష్మి కింద నెలకు రూ. 2500లు అందజేస్తామని హామీ ఇచ్చి 25 నెలలు గడిచినా ఇప్పటికీ ఒక్క లబ్దిదారుకు ఒక్క పైసా దక్కలేదు. అందుకే ఈసారి బ్జడెట్ కేటాయింపుల్లో ఈ గ్యారెంటీ అమలుకు అడుగులు పడకపోతే ఆడబిడ్డలు ఊరుకునే ప్రసక్తే లేదనే విషయాన్ని గుర్తుచేస్తున్నాను. అలాగే కేసీఆర్ గారి హయాంలో తెలంగాణను పంజాబ్ నే తలదన్నేలా, దేశానికే ధాన్యాగారంగా తీర్చిదిద్దిన రైతులకు అందిన రైతుబంధును 15 వేలకు పెంచుతామని మాటిచ్చి మోసం చేసినందుకు ముందు క్షమాపణలు చెప్పి, ఆ మొత్తాన్ని బ్జడెట్ లో కేటాయించాలని అన్నదాతల పక్షాన కోరుతున్నాను. అలాగే ఇప్పటికే మూడుసార్లు పెండింగ్‌లో పెట్టిన రైతుబంధు పాత బకాయిలను కూడా చెల్లించాలన్న రైతుల డిమాండ్‌ను మీ ముందు ఉంచుతున్నాను. అలాగే కౌలు రైతులకు, రైతు కూలీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వారి ఖాతాల్లో నిధులు జమ చేయాలని కోరుతున్నాను. కేవలం రైతులు, మహిళలకే కాదు, నిరుద్యోగులకిచ్చిన ప్రతి హామీ కూడా రెండేళ్ల నుంచి పెండింగ్ లోనే ఉంది. తొలి ఏడాదే రెండులక్షల ఉద్యోగాల భర్తీతోపాటు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుకు కూడా బ్జడెట్ లో కేటాయింపులు చేయాలని తెలంగాణ యువతీ యువకుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. అలాగే ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లకు ఇస్తానన్న ఆర్థిక సహాయం అందజేయడానికి 2026-2027 బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కోరుతూ బీఆర్ఎస్ పక్షాన కోరుతున్నాను.ప్రజాపాలన పేరిట మరొక్కసారి ప్రజలను మభ్యపెట్టడానికి, నిట్టనిలువునా మోసగించడానికే సన్నాహాలు చేస్తున్నట్లు కనబడుతోంది. అలాగే పనికిరాని అంశాలను తెరపైకి తెచ్చి ప్రతిసారి అటెన్షన్ డైవర్ట్ చేయాలని మీరు చేస్తున్న కుట్రలు తెలంగాణ సమాజానికి అర్థమైపోయాయన్నారు. మొదటి క్యాబినెట్ లోనే 6 గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని నాడు పీసీసీ అధ్యక్షుడిగా మీరు హామీ ఇచ్చిన విషయాన్ని మీరు మరిచిపోయినట్టు నటించినా, ప్రజలకు మాత్రం అన్నీ గుర్తున్నాయనే విషయాన్ని స్పష్టంచేస్తున్నాను.

# అన్ని దానాల్లో రక్తదానం మిన్న, రక్తదానం ప్రాణదానంతో సమానం

## జనసేన పార్టీ ఇంచార్జ్ బొమ్మ రెడ్డి ప్రేమ కుమార్..



ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : రక్తదానం ప్రాణదానంతో సమానమనీ ఇది సాటి మనిషికి మీరు ఇచ్చే వెలకట్టలేని బహుమతని కూకట్పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పేర్కొన్నారు. చత్రపతి ధర్మరక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షులు కర్ర వేణుగోపాల్ ఆహ్వానం మేరకు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలలో భాగంగా ముసాపేట్, గూడ్స్ షెడ్ రోడ్ లోని పినాకిల్ క్యాంపస్ లో జరిగిన రక్తదాన శిబిరానికి ప్రత్యేక అతిథిగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ హాజరయ్యారు. తల సేమియా సికిల్ సెల్ సొసైటీ డైరెక్టర్ రత్నావళి, పినాకిని గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్ వై శ్రీదేవి లు విచ్చేసి ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్ర పటానికి పుష్పమాలలు అర్పించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రేమకుమార్ని నిర్వాహకులు శాలువా తో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ శివాజీ మహారాజ్ ధైర్యం, పరాక్రమం, స్వాభిమానమే మనకు ఆదర్శం అని యువత దేశభక్తితో, నైతిక విలువలతో ముందుకు సాగాలని పేర్కొని రక్త దానం చేసిన యువతకు సర్టిఫికెట్ పండ్లు అందజేశారు. ఒక రక్తదానం ద్వారా 3 మంది ప్రాణాలను రక్షించే అవకాశం ఉంటుందనీ తలసేమియా, ప్రమాదాలు, శస్త్రచికిత్సలు వంటి అత్యవసర పరి స్థితుల్లో రక్తం ఎంతో అవసరం అని యువతను, నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, బొగాది వెంకటేశ్వరరావు, వేముల మహేష్, పోలె బోయిన శ్రీనివాస్, మరియు చత్రపతి ధర్మ రక్షణ సేన ఉపా ధ్యక్షులు గాలి అనిత,తాండూర్ సునీత, తాండూర్ శ్రీనివాసరాజు, నాగేశ్వర్ గుప్తా, పవన్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఫిరోజ్ ఖాన్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మిత్రులు..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



రాజకీయ నేతల పుట్టినరోజు వేడుకలు వ్యక్తిగతంగా కాకుండా పార్టీ బలాన్ని ప్రదర్శించే, ప్రజలకు దగ్గర అవకాశాలుగా మారుతాయి. అభిమానులు తమ అభిమానాన్ని చాటడం కోసం తమ అభి మాన నాయకుడికి గుర్తుండే విధంగా పుట్టినరోజు వేడుకలను సంతోషంగా జరుపుతారు అటువంటి కోవలోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, మనసున్న మనిషి, మైనారిటీ నాయకుడు ఫిరోజ్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వారి మిత్రులు, ఫిరోజ్ ఖాన్ అభిమానులు అందరూ కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి, ఎవరికివారు ప్రత్యేకంగా తెచ్చిన కేక్ ను ఫిరోజ్ ఖాన్ చేత కట్ చేపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ నా పుట్టినరోజు సందర్భంగా వచ్చి నాకు శు భాకాంక్షలు తెలిపిన అందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని అన్నారు. ఈ పుట్టినరోజు వేడుక జరిగిన (19/2/2026) నాకు ప్రత్యేకంగా గుర్తుండే రోజు అని అన్నారు.

## గొప్ప సైనిక వ్యూహకర్త..

### మాజీ కార్పొరేటర్ దేదీప్య విజయ్ రావు


ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :




చత్రపతి శివాజీ మహారాజ్ హిందూ సామ్రాజ్యం కోసం పోరాడిన గొప్ప యోధుడు. ఫిబ్రవరి 19 1630న శివనేరి కోటలో జన్మించారు చత్రపతి శివాజీ మహారాజ్. వారి పుట్టినరోజు వేడుకలను గుర్తు చేసుకుంటూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ లోని బంగారు మైసమ్మ ఆలయం ముందు ప్రాంతంలో హిందూ సమ్మేళనం ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు భరత్ తో పాటు వారి టీం (యూత్ )నిర్వాహకుల ఆహ్వాన మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి విష్ణువర్ధన్ రెడ్డి తో పాటు వెంగల్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ దేదీప్య విజయ్ రావు, చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలు వేసి వారిని స్మరించుకున్నారు ముఖ్య అతిథులు. కార్యక్రమ నిర్వాహకులు అతిధులుగా వచ్చిన వారికి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేదీప్య వెంట వారి శ్రీవారు విజయ్, ఎర్రగడ్డ టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు డి సంజీవ, యూసఫ్ గూడా డివిజన్ టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బసవరాజు, రహమత్ నగర్ కు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాకేష్, తో పాటు తరుణ్,దుర్గ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేదీప్య మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ గొప్ప సైనిక వ్యూహకర్త అని అన్నారు.

## గెరిల్లా యుద్ధంలో నిష్ణాతులు : మాగంటి సునీత

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



బోరబండ డివిజన్‌లో (జూబ్లీహిల్స్ నియోజకవర్గం) ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహక ఆహ్వాన మేరకు జూబ్లీ హిల్స్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కాంటెస్ట్ డ్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత పాల్గొని చత్ర పతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా మాగంటి సునీత మాట్లాడుతూ గెరిల్లా యుద్ధంలో నిష్ణాతులు చత్రపతి శివాజీ మహా రాజ్ అని అన్నారు.ధైర్యం, వీరత్వం, స్వాభిమానం యొక్క ప్రతీకగా నిలిచిన మహారాజ్ ఆశయాలను స్మరించుకుంటూ యువత స్ఫూర్తిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జై బోలో చత్రపతి శివాజీ మహారాజ్‌కీ అనే నినాదంతో యువత ముందుకు సాగారు.

## ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్‌తో సోషల్ వర్కర్ జి.దినేష్ కుమార్..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



శ్రీ కృష్ణా నగర్ (జూబ్లీహిల్స్ నియోజకవర్గం)లో గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభిం చారు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ నగర్ బి బ్లాక్ లో నివాసం ఉండే సోషల్ వర్కర్, స్థానిక సమస్యల గురించి నిరంతరం పోరాడే జి. దినేష్ కుమార్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా దినేష్ కుమార్ మాట్లాడుతూ ఇంతకు ముందు నోచుకోని అభివృద్ధి పనులను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ పట్టించుకోని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు, శ్రీకృష్ణ నగర్ కు శుభ పరిణామం అని అన్నారు.

## ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్‌కు ఆహ్వానం అందజేసిన సెక్టార్ 2 అధ్యక్షులు, వారి టీం

ఏ ఎం ఎస్ పటాన్చెరు :




ఫిబ్రవరి(2026) 20వ తారీకు ఉదయం దుర్గ అమ్మవారి కళ్యాణాన్ని ఫేస్ 2లో నిర్వహించారని నిర్ణయించారు సంగారెడ్డిజిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం ఉస్మాన్ నగర్ పరిధిలోని (నూతనంగా జిహెచ్ఎంసి లో కలిసిన తెల్లాపూర్ సమీపంలో ఉన్న) డబల్ బెడ్ రూమ్ ఫేస్ టు (2) వాసులు అయిన సెక్టర్ 2 అధ్యక్షుడు అయ్యప్ప, వారి టీం.ఈ కళ్యాణ మహో త్సవంలో పాల్గొనాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ ను వారి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వారిని ఈ కళ్యాణ మహోత్సవ వేడుకలు పాల్గొన వలసిందిగా ఆహ్వానం అందజేశారు అయ్యప్ప, వారి టీం. ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ఆహ్వానిం చిన వారి టీంలో తెలుగు కృష్ణ, 36 బ్లాక్ కృష్ణ, తో పాటు తుమ్మల పవన్ కుమార్ ఉన్నారు.

## ఇంట్లో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించిన జానాజీ నిఖిల్..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను వారి విగ్రహాలు ఉన్నచోట, సభ స్థలాలు ఏర్పాటు చేసి వారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పురాణపుల్ లో స్మారక చిహ్నం వద్ద, శ్రీశైలంలో ఆయన స్ఫూర్తి కేంద్రం వద్ద ఘనంగా వారిని స్మరించుకుంటూ అభిమానులు, రాజకీయ నాయకులు, వారి వారి పద్ధతుల్లో నిర్వహిస్తారు. కానీ ఇంట్లోనే ప్రత్యేక పూజలు చేసిన సంఘటన జూబ్లీహిల్స్ నియో జకవర్గం వెంగల్ రావు నగర్ డివిజన్ మధురానగర్ ఏ, బ్లాక్ 19లో స్థానికంగా నివాసం ఉంటున్న జానాజి నిఖిల్ వారి నివాసంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటాన్ని ఏర్పరిచి పూల మాలవేసి, ప్రత్యేక పూజచేసి వారిని స్మరించుకున్నారు. ఈసందర్భంగా జానాజి నిఖిల్ మాట్లా డుతూ న్యాయం ధర్మం కోసం పోరాడి అందరినీ సమానంగా చూసుకునేలా ఉన్న గొప్ప నాయ కుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని అన్నారు. మా తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్ల నేను ఇంట్లోనే చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశానని అన్నారు. ఏది ఏమైనా ఇంట్లో చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేసి స్థానికులను ఆకట్టుకున్నారు జానాజి నిఖిల్.

## మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

### పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ

### దీనబంధు కాలనీలో ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



హిందూ ధర్మ పరిరక్షణకు పోరాడిన మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. చత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని దీనబంధు కాలనీలో ఉన్న శివాజీ విగ్రహానికి సొసైటీ అధ్యక్షులు మాలోత్ మహేందర్ నాయక్, బస్తీవాసులు, శివాజీ అభిమానులతో కలిసి గురువారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హిందూ సామ్రాట్ గా శివాజీ రాయ్ గఢ్ కోటలో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి చారిత్రాత్మక యోధుడిగా పేరుగాంచారని కొనియాడారు. భారత జాతి సగర్వంగా చెప్పుకునే ధీరుడు శివాజీ అని, సనాతన ధర్మ పరిరక్షణకు అవిశ్రాంతంగా పోరాడారన్నారు. భవాని మాత చేత వీర ఖడ్గం పొందిన వీరుడు శివాజీ ఆశయ సాధనకు పాటుపడుతూ ఐక్యతను చాటాలన్నారు. నాయకులు దేవ భూషణం, రాజు ముదిరాజ్, గుండ్లకొండ బాలు, రాజా మేష, అజ్జు, సుహాస్ తదితర నాయకులు శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## కుల మతాలకు అతీతం చత్రపతి శివాజీ మహారాజ్ తత్వం

### - టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కుల మత ప్రాంతాలకు అతీతం చత్రపతి శివాజీ మహారాజ్ తత్వమని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బాలానగర్ కు చెందిన జై శ్రీరామ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బాలనగర్ చౌరస్తా వద్ద నూతనంగా శివాజీ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివాజీ అనంతర కాలంలో ధర్మం కోసం జరిగిన పోరాటాలకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. భారతదేశ చరిత్రలో హిందూ ధర్మ పరిరక్షణ కోసం చత్రపతి శివాజీ చేసిన ధైర్యం పోరాటం సాహసం నేటి యువతకు స్ఫూర్తిగా కొనసాగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు అన్నసంతర్పణ నిర్వహించారు. నిర్వాహకులను రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మయ్య, పులి శివకుమార్ గౌడ్, మాదిరెడ్డి యుగేందర్ రెడ్డి, ఆకుల నరేందర్ ముదిరాజ్, పుష్ప రెడ్డి,పులి శ్రీకాంత్ పటేల్, గోపిశెట్టి రాఘవేందర్, సతీష్ గౌడ్, శివ చౌదరి, మరియు జై శ్రీరామ్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా మాధవరం కృష్ణారావు జన్మదిన వేడుకలు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా కూక ట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వివేకా నంద నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల (ప్రైమరీస్కూల్) దగ్గర పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ కార్పొరే టర్ జూపల్లి సత్యనారాయణరావు, వివేకానంద డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు హాజరై ఆంజనేయ స్వామి గుడిలో పూజలు నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం స్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

## జయంతి ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మన్నే గోవర్ధన్ రెడ్డి

ఏ ఎం న్యూస్, ఖైరతాబాద్:



ఖైరతాబాద్ డివిజన్ రైల్వే గేట్ దగ్గర చత్రపతి శివాజీ మహారాజ్ యూత్ క్లబ్ శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు ఖైరతాబాద్ నియోజకవర్గ బి.ఆర్. ఎస్. పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మన్నె గోవర్ధన్ రెడ్డి కి శాలువాతో ఘనంగా సన్మానించారు కమిటీ సభ్యులు.ఈ సందర్భంగా మన్నె గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ ఫిబ్రవరి 19,1630 న శివనేరి కొండకోటలో జన్మించారు అని అన్నారు ధర్మం కోసం జరిగిన పోరాటాలకు చత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ గజ్జల ఆనంద్ , మహేందర్ బాబు,చందు , మధుకర్ యాదవ్, కిశోర్ , నాగరాజు, శ్రీనివాస్ ,అశోక్, నిశాంత్ ధనరాజ్, శశి, శౌరి రాజ్ పాల్గొన్నారు. తదుపరి జరిగిన అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొని స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు మన్నె గోవర్ధన్ రెడ్డి.

## ఫిరోజ్ ఖాన్‌కి చిత్రపటాన్ని బహుకరించిన హారిక

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



పుట్టినరోజును సాధారణంగా కుటుంబ సభ్యుల మధ్య, స్నేహితుల మధ్య జరుపుకుంటారు. పుట్టినరోజు వేడుకల కు వెళ్ళేటప్పుడు బహుమతులను అందించడం ఆనవాయితీగా వస్తున్న ఈ రోజులలో అటువంటి సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ హారిక గురువారం పుట్టినరోజు జరుపుకుంటున్న జూబ్లీ హిల్స్ నియోజకవర్గం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, అందరినీ కలుపుకొని పోయే ఫిరోజ్ ఖాన్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి వారి చిత్రంతో ఉన్న చిత్రపటాన్ని బహుమతిగా అందించారు. ఈ బహుకరించిన చిత్రపటంలో రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్ ఫోటో ఉండడం విశేషం.

# శ్రీ కృష్ణానగర్‌లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్ గూడ డివిజన్ శ్రీ కృష్ణ నగర్ పిల్లర్ నెంబర్ 1545 సమీపంలో 12 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేయనున్న త్రాగునీటి పైపులైను పనులకు ,8 లక్షలతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజ్ పనులకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గురువారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్‌కి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ మాట్లాడుతూ రూ. 12 లక్షల వ్యయంతో నూతన త్రాగునీటి పైపులైను ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ. 8 లక్షలతో డ్రైనేజ్ పనులు పూర్తి చేసి వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా ఉండేలా ఈ అభివృద్ధి పనులు అని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంజయ్ గౌడ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి సాయినాథ్ యాదవ్, కృష్ణానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, యూసఫ్ గూడా డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈ.ఎల్. రామయ్య, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యాంబాబు యాదవ్,సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాసనాల గాలయ్య , సీనియర్ నాయకులు మంగళరాపు లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ యూసఫ్ గూడ డివిజన్ మాజీ అధ్యక్షుడు( కాంగ్రెస్ పార్టీ) ఫిరోజ్ ఖాన్, యూత్ లో మంచిపట్టున కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున్ యాదవ్, అందరినీ కలుపుకొని పోయే కాంగ్రెస్ పార్టీ నాయకులు సంపత్, సమస్యలపై పోరాడే నాయకుడు జి.దినేష్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్( బి బ్లాక్ ), కే నాగేశ్వరరావు, తిరుపతి, బి.రాజేష్ యాదవ్, ప్రేమ్, తోపాటు స్టేట్ జనరల్ సెక్రటరీ( కాంగ్రెస్ పార్టీ )హారిక, మహిళా నాయకురాలు ఆదిలక్ష్మి, మహిళలలో మంచి పేరున్న భాగ్యలక్ష్మి, సీనియర్ నాయకురాలు అన్నపూర్ణ, రాధికతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తర్వాత గురువారం పుట్టినరోజు జరుపుకుంటున్న యూసఫ్ గూడా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్ తో కేక్ కట్ చేపించారు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్.

# యాదాద్రిలో రెండవ రోజు ధ్వజారోహణం మహోత్సవం





ఏ ఎం న్యూస్, యాదగిరిగుట్ట:
తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు స్వస్తివచనముతో ప్రారంభమై రెండవ రోజయిన ఈరోజు దేవాతాహ్వానము, ధ్వజారోహనము నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో అతి ప్రధానమైన ఘటం ధ్వజారోహనము. ద్వజస్తంభం అధిపతి అయిన గరుత్మంతుని తెల్లటి వస్త్రంపై పసుపు, కుంకుమ, గంధముతో గరుత్మంతుని చిత్రపటాన్ని వేసి అందులోనికి వేదమంత్రాలతో, మూర్తిమంత్రాలతో ఆవాహనము చేశారు. ఆలయ అర్చకులు. గరుత్మంతుని ఆవాహనము చేసిన చిత్ర పటానికి ద్వజస్తంభానికి కట్టి పసుపు, కుంకుమలతో చేసిన అన్నం ముద్దలను అరగింపుగా ఎగురవేసి నైవేద్యంగా సమర్పించి ముక్కోటి దేవతకు స్వామి వారి కళ్యాణ ఆహ్వానము గరుత్మంతుని ద్వారా అందచేశారు ఉపనిషత్తులలో శ్లోకాలతో, వేద పారాయన ములతో అర్చకులు దేవతలను ఆహ్వానించారు. గరుత్మంతునికి నైవేద్యంగా సమర్పించిన అన్నం ముద్దలను భక్తులకు పంచి పెట్టారు. ఈఅన్నం ముద్దలను సంతానము లేనివారు తింటే సంతాన భాగ్యం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. అన్నం ముద్దలకొరకు భక్తులు వివిధ ప్రాంతాల నుండి విశేషంగా తరలివచ్చారు. అనంతరము శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచారు. మాడవీధుల్లో స్వామి వారి అలంకారా సేవ ఊరేగించారురు. బ్రహ్మోత్సవాల రెండో రోజు ధ్వజారోహనము పేరుతో గరుత్మంతునికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు, ముక్కోటి దేవతలను వేదమంత్రాలతో, ప్రత్యేకపూజలతో ఆహ్వానించినట్లు ఆలయఅర్చకులు తెలిపారు.

# మేధస్సుకు పదును పెట్టెలా మండలసైన్స్ టాలెంట్ టెస్ట్

ఏ ఎం న్యూస్ యాదగిరిగుట్ల:
విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు పెంపొం దించటానికి హేతువాద దృక్పథం పెంచటానికి పరిజ్ఞానం పరీక్ష ఉపయోగ పడుతుందని డీ ఈ ఓ శరత్ యామిని అన్నారు. జాతీయసెన్స్ కార్యక్రమంలో భాగంగా ఎఫ్ పి ఎస్ టి ఆధ్వర్యంలో మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ పిఎం జిల్లాపరిషత్ (బాలురు) యాదగిరిగుట్టలో గురువారం నిర్వహించారు .ఎఫ్ పి ఎస్ టి మండల కన్వీనర్ చింతోజు శ్రవణ్ కుమార్, కో-కన్వీనర్ లక్కీరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు తెలిపారు . మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలోని 8, 9 తరగలు చదువుతున్న విద్యార్థులాలో తరగతి కొకరు చొపున టెస్టో. పాల్గొనేటట్లు అవకాశం కల్పించార్ను ఈ సందర్భంగా యాదగిరిగుట్ట మండల విద్యాధికారినీ శరత్ యామిని మాట్లాడుతూ, ప్రపంచంతో పోటీ పడేలాచేస్తూ విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి ఇలాంటి పరీక్షలు ఎంతో దోహదపడతా యని, విద్యార్థుల్ని ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుల కృషిని అభినందిం చారు. మండల



స్థాయిలో ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచిన జడ్పిఎచ్ఎస్ మాసాయిపేట విద్యార్థులు ఇస్మాయిల్, అమ్మీన్లకు బహుమతులు అందచేసారు. గైడ్ టీచర్ మాధవి మేడంను, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన భూమిక నిర్వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఎంఇఓ శరత యామినీ, చింతోజు శ్రవణ్ కుమార్, ఉదయశ్రీ, బాలరాజ్, లక్కీ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాధవి, మాధవి, వెంకట క్రిష్ణ నరేశ్, సుదర్శన్, సత్యపాల్ రెడ్డి తదితర ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మాదిగలకు రాజ్య సభ సీటు హామీ మరిచారా సీఎం రేవంత్ రెడ్డి?

**RPI(భీమ్ రావ్ అంబేద్కర్)పార్టీ**
**అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్**

ఏ ఎం న్యూస్ ఓయూ:
పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మూడు ఎంపీ సీట్లను మాదిగలకు ఇవ్వకుండా వారి ఓట్లతో అధికారంలోకి వచ్చి రాజ్యసభ సీటు తప్పక మాదిగలకు ఇస్తామన్నా హామీ మరిచి తెలంగాణ రాష్ట్రలో ఖాళీ అవుతున్న రెండు సీట్లు ఒకటి ఉత్తరాభరతని చెందిన సుప్రీమ్ కోర్టు సీనియర్ లాయర్ అభిషేక్ మను సింగ్వికి మరోసారి ఇస్తున్నారని మరొక సీటును సుప్రీమ్ కోర్టు మాజీ న్యాయమూర్తి ఉప రాష్ట్ర పతి పదవికి పోటీ చేసి ఓడిపోయిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఇస్తున్నారన్న వార్తల నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని RPI(భీమ్ రావ్ అంబేద్కర్)పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు గురువారం తార్నాక లోని రాష్ట్ర కార్యాలయంలో జై భీమ్ సేన రాజ్యాంగాన్ని 6వ తరగతి నుండి ఉన్నత విద్యా వరకు పాఠ్యాంశంగా చేర్చాలని మార్చ్ 1 నుండి చేపట్టే రాధయాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం మత గ్రంధాల కంటే విప్లవాత్మకమైనదని దేశం లోని 145 కోట్ల మంది భారతీయులు తెలంగాణ ప్రజలు తప్పక తమ హక్కులు విధులు



భాధ్యతలు రాజ్యాంగ ద్వారా తెలుసుకొని తమ హక్కులను కాపాడుకోవాలని అందుకు రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేరిస్తే ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక హక్కులను తెలుసుకోవడమే కాకుండా పరిరక్షించుకుంటాడని ఈ రథయాత్ర అందుకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రజలందరూ ఈ రథయాత్రలో పాల్గొని రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకొని పాఠ్యాంశంగా రాజ్యాంగాన్ని చేర్చాలని డిమాండ్ ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వరకు తమ పోరాటం కొనసాగించాలని ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో జై భీమ్ మహాసేన మానవ హక్కుల పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్యాంగం అంజన్న తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గట్టు అశోక్ సలహాదారులు ప్రభుదాస్ మహిళా నాయకురాలు ఇందిరా చంటి తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను రక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ఏ ఎం న్యూస్/ హైదరాబాద్ :
సికింద్రాబాద్ వారాసిగూడలోని నైటింగేల్ హోమ్స్ నేతాజీ రెయిన్బో కమ్యూనిటీ కేర్ అండ్ లెర్నింగ్ సెంటర్‌లో (CPC) గురువారం చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నైటింగేల్ హోమ్స్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి నమ్రత జైస్వాల్ మాట్లాడుతూ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ముఖ్యతను వివరించారు. పిల్లల రక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కమ్యూనిటీ సభ్యులు కలసి ముందుండాలని ఆమె పిలుపునిచ్చారు. పిల్లలు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతున్నారా లేదా అన్నది తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలని సూచించారు. తరచుగా పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడి, ఎవరైనా విద్యార్థులు చదువు మానేస్తే (డ్రాపౌట్స్) వారిని మళ్లీ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే బాల్యవివాహాలు ఎక్కడైనా జరిగే అవకాశముంటే వాటిని అడ్డుకోవడానికి తక్షణమే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని, పిల్లల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని కమిటీ సభ్యులకు




అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సిబిసి కోఆర్డినేటర్లు కళావతి, రాజు, లెర్నింగ్ సెంటర్ సిబ్బంది ఝాన్సీ, మౌనిక, మంజుల, కమిటీ సభ్యులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా అమన్‌వేదిక స్ట్రీట్ మెడిసిన్ వారి సహకారంతో డాక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం ద్వారా మందులు పంపిణీ చేసి, మొత్తం 80 మంది కమ్యూనిటీ ప్రజలు మరియు పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పిల్లల భద్రత, విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో సమాజం మొత్తం బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని సమావేశంలో మరోసారి స్పష్టం చేశారు.

# ర్యాలీకు స్వాగతం పలికిన కుంట రాజేష్, వారి టీం





ఎ ఎం న్యూస్ సనత్ నగర్:
దమ్మయాత్ర అంటే బొద్ద ధర్మం, శాంతి, అహింసను ప్రచారం చేయడానికి చేపట్టే పాదయాత్ర. గౌతమ బుద్ధుని బోధనలను విస్తరించడానికి ఇటువంటి యాత్రలు నిర్వహిస్తారు. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ ఎస్ ఆర్ నగర్ మీదుగా ట్యాంక్ బండ్ నుండి వివిధ ప్రాంతాలకు చేరుకునే మూడవ శాంతి యాత్ర ర్యాలీ కి ఘన స్వాగతం పలికారు న్యాయవాది కుంట రాజేష్, వారి టీం. కుంట రాజేష్ ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహానికి బౌద్ధ బిక్షులు పూలమాల వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమం లో కుంట శ్రీహరి, గాడి అరవింద్ కుమార్ ( న్యాయవాది), రఘు వర ప్రసాద్ రెడ్డి (న్యాయవాది ), పాల్గొన్నారు వీరితో పాటు వేణుగోపాల్, శ్రావణ్,శివ, మనోహర్ ప్రేమ్ నరేష్ జయప్రకాష్,వంశీ, రాజశేఖర్ (న్యాయవాది )నందు (న్యాయవాది) పాల్గొన్నారు. ఈ ర్యాలీలో రామాయన్ పాత టీవీ సీరియల్ నటుడు, బుద్ధుడి వేషంలో నటించి అందరి మెప్పు పొందిన నటుడు, టీవీ నటుడు గగన్ మల్లిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న భిక్షు సంఘపాల ( మహా భోగి బుద్ధ విహార్, సికింద్రాబాద్ మహీంద్రా హిల్స్ లో ఉన్న ) మాట్లాడుతూ మూడవ శాంతి యాత్ర కర్ణాటక కల్బురిగి( గుల్బర్గా పిలవబడిన ) నుండి ఫిబ్రవరి 3 (2026) మొదలైందని మార్చి మూడవ తారీకు(2026) వరకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమ ర్యాలీ కి ఆతిథ్యమిచ్చిన న్యాయవాది కుంట రాజేష్ మాట్లాడుతూ థాయిలాండ్ నుండి వచ్చిన బౌద్ధ బిక్షువులు 50 మంది, మన తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన భిక్షువులు పదిమంది , ఇతర భిక్షువులు 20 మంది మొత్తం 80 మంది బిక్షువులు ఈ కార్యక్రమంలో పాల్గొని మేము ఇచ్చిన ఆతిధ్యాన్ని స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంజీవరెడ్డి నగర్ పోలీస్ స్టేషన్ సిఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కిందిస్థాయి సిబ్బందితో కలిసి భారీ బందోబస్తు నిర్వహించారు. న్యాయవాది వృత్తిలో ఉండి ఇటువంటి సేవాభావం గల సేవలు చేస్తున్న కుంట రాజేష్ ని అక్కడున్న పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి బౌద్ధ బిక్షునికి మంచినీరు తోపాటు కూల్డ్రింకులు పంపిణీ చేశారు కుంట రాజేష్, వారి టీం.

# ఎంతో అభివృద్ధి చెందిన కాశీ పుణ్యక్షేత్రం

## బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి..

ఏ ఎం న్యూస్ ఓయూ:



సనాతన ధర్మాన్ని హిందూ సంప్రదాయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కాశీ పుణ్యక్షేత్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. కాశీ క్షేత్రం ఎంతో అద్భుతంగా ఉందని చెప్పారు. కనువిని ఎరగని పద్ధతిలో అభివృద్ధి పరిచిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు తొమ్మిది రోజుల తీర్థ యాత్రలో భాగంగా గణేష్ చారి తన కుటుంబ సభ్యులతో కలిసి కాశి విశ్వేశ్వరుని, అన్నపూర్ణాదేవి విశాలాక్షి, దుర్గ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీలోని రామ కోడు ఏరియాలో తెలంగాణకు చెందిన కొంతమంది దాతలు సత్రాన్ని ఏర్పాటు చేశారని తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు ఈ సత్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తక్కువ ధరకే అన్ని వసతులతో కూడిన రూములు టిఫిన్ భోజనం సాయంత్రం టిఫిన్ సాంప్ర దాయ పద్ధతిలో ఇవ్వడం ప్రత్యేకత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదండ రాములు, ప్రభా వతి, ఓంకార చారి, సువర్ణ, కుందారం జయలక్ష్మి, చంద్రకళ, లావణ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఓయూ సీఐను కలిసిన ఓయూ జెఏసి చైర్మన్ కొత్తపల్లి తిరుపతి


ఏ ఎం న్యూస్, ఓయూ:




ఓయూ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా పదవి బాధ్యతలు చేపట్టిన మాదగాని మహేష్ గౌడ్ ను ఓయూ జేఏసి చైర్మన్ కొత్తపల్లి తిరుపతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సిఐ కు పండ్లు ఇచ్చి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు ఎప్పటికప్పుడు నిఘా పెంచుతూ అసాంఘీయ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు విద్యార్థి నాయకులుగా తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాస్, చరణ్, రాజేందర్, రమేష్, శివాజీ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రద్ధ స్ఫూర్తి కాలేజ్‌లో ఘనంగా అన్యువల్ డే వేడుకలు..

ఏ ఎం న్యూస్ ఓయూ:




కీసర లోని శ్రద్ధ జూనియర్ కాలేజ్, స్ఫూర్తి డిగ్రీ కాలేజ్ లో ఘనంగా అన్యువల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు చిన్నారులు భరతనాట్యం వెస్ట్రన్ డాన్సులతో స్టెప్పులు వేసి చూపర్లను అలరించారు.ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ ఎండీ మదర్, నహీమా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు.పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహులు, యమున, భాస్కర్, పుష్ప, సోమశేఖర్, రేణుకలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



# అత్యాచార పాత్రలో నటించడం ఈజీ కాదు




తాప్సీ పన్నూ ప్రధాన పాత్రలో బాలీవుడ్ దర్శకుడు అనుభవ సిన్హా దర్శకత్వంలో తెరకెక్కిన 'అస్సి' చిత్రంలో అత్యాచార బాధితు రాలిగా నటించిన మలయాళ నటి కని కుస్రుతి తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఫిబ్రవరి 20న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఈ చిత్రంలో 'పరిమ' అనే వివాహిత పాత్రలో నటించబోతున్నట్లు తెలిపింది. అత్యాచారానికి గురైన ఒక మహిళ అనుభవించే మానసిక వేదనను వేరొకరు పూర్తిగా అర్థం చేసుకోవడం అనేది చాలా కష్టమైన విషయం. అలాంటి పాత్రలో తాను నటించడం చాలా సవాలుతో కూడుకున్నది. ఒక నటిగా ఆ వేదనకు సాధ్యమైనంత దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నించానని, కొన్ని క్షణాల్లో అది నిజంగా తనకే జరుగుతోందా అనేంతగా లీనమయ్యానని కని తెలిపారు. అయితే ఆ ట్రామాలోకి పూర్తిగా వెళ్లడం వల్ల వ్యక్తిగతంగా తనపై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో కొంత దూరం పాటించానని ఆమె వివరించారు. భారతదేశంలో పెరుగుతున్న ఒక మహిళగా ఇలాంటి దాడులు లేదా వేదనల గురించి అవగాహన ఉండటం తనకు సహజమని తెలిపిన కని.. తన సన్నిహితులు కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం వల్ల ఇది మన చుట్టూ ఉండే చేదు వాస్తవమని కని పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా భారతీయ న్యాయ వ్యవస్థలోని క్లిష్టతలను కూడా తాను అర్థం చేసుకున్నానని, కోర్టు విచారణల సమయంలో బాధితులు పాత గాయాలను మళ్లీ తలుచుకుంటూ ఎంత నరకం అనుభవిస్తారో తనకు అర్థమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో నివసించే పరిమ అనే మహిళ కిడ్నాప్‌కు గురై, సామూహిక అత్యాచారానికి గురైన తర్వాత ఆమె న్యాయం కోసం చేసే పోరాటం చుట్టూ ఈచిత్ర కథ తిరుగుతుంది. ఈచిత్రంలో తాప్సీ పన్నూ లాయర్‌గా నటించగా, మహమ్మద్ జీషన్ అయ్యూబ్, మనోజ్ పహ్వా, రేవతి తదితరులు కీలక పాత్రలు పోషించారు. దేశంలో రోజుకు సగటున నమోదవుతున్న 80 అత్యాచార కేసులను సూచిస్తూ ఈచిత్రానికి 'అస్సి' (హిందీలో 80) అని పేరు పెట్టారు.



## మిరాకిల్ షూట్‌లో ఎంటర్ కానున్న హెబ్బా పటేల్



టాలీవుడ్ హాట్ బ్యూటీ హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ 'మిరాకిల్'. 'సత్య గ్యాంగ్', 'రౌటర్ శివ' వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ నిమ్మల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమా, మూడో షెడ్యూల్‌ను ఈనెల 24 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనుంది. ఈ షెడ్యూల్‌లో హెబ్బా పటేల్ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. సైదా ఫ్యామిలీ ఎంట్టంల్గ÷న్మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు పోషించడం విశేషం. ఈ చిత్రం ద్వారా నాయుడు పెంద్ర విలన్‌గా పరిచయమవుతున్నారు. గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ చిత్రంలో సీనియర్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ప్రభాస్ నిమ్మల స్వయంగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందించడమే కాకుండా సంగీతాన్ని కూడా సమకూర్చడం ఈ సినిమా ప్రత్యేకత. రవి బస్రూర్ వంటి దిగ్గజాల స్ఫూర్తితో రూపొందుతున్న యాక్షన్ బ్లాక్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమని, ఝాన్సీ, విజయ్ సూర్య వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ 'మిరాకిల్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో చూడాలి.

## కేరళ స్టోరీ-2కు యూ/ఏ సర్టిఫికెట్ జారీ




మనోజ్ బాజ్‌పేయి చిత్రం 'ఘూస్‌ఖోర్ పండత్' టైటిల్‌పై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించిన తరుణంలో మరో వివాదాస్పద చిత్రం 'ది కేరళ స్టోరీ 2' విడుదలకు లైన్ క్లియర్ అయింది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు 'యూ/ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. దీనివల్ల 14 ఏళ్లు పైబడిన వారు ఈ సినిమాను వీక్షించే అవకాశం లభించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నిర్ణయంపై చిత్ర నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా స్పందిస్తూ, సెన్సార్ బోర్డు తమ కథలోని నిజాయితీని నమ్మిందని, బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. మత మార్పిడి వంటి సున్నితమైన అంశాలతో రూపొందిన ఈ చిత్రంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు. ఇది రాష్ట్రాన్ని కించపరిచేలా ఉన్న 'విద్వేషపూరిత ప్రోపగాండా' అని ఆయన అభివర్ణించారు. కేరళలోని లౌకిక సంప్రదాయాన్ని దెబ్బతీసేందుకు ఇలాంటి సినిమాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే నిర్మాత విపుల్ షా మాత్రం, ఈ సినిమా యువతులకు మరియు కుటుంబాలకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినదని అందుకే సెన్సార్ బోర్డు సానుకూలంగా స్పందించిందని అభిప్రాయపడ్డారు. కామఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో ఉల్కా గుప్త, అదితి భాటియా మరియు ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాను విపుల్ షా నిర్మించాడు. ఈ చిత్రం ఫిబ్రవరి 27, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

Mana Cinemalu

## విశ్వక్‌సేన్ డైరెక్షన్‌లో కల్ట్




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరోసారి మెగా ఫోన్ పట్టాడు. విశ్వక్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'కల్ట్' . 'ఫలక్‌నుమా దాస్', 'దాస్ కా దమ్కీ' వంటి సినిమాల తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఎంతో ఉత్కంఠభరితంగా, సాహసోపేత మైన కథాంశంతో ఉండబోతుందని తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా ద్వారా ఏకంగా 40 మంది కొత్త నటీనటులను వెండితెరకు పరిచయం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. వియత్నాంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా, నేటి కాలపు యువతను ఆకట్టుకునేలా ఒక కొత్త తరహా కథను విశ్వక్ సేన్ స్వయంగా రాసి తెరకెక్కించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు మరియు ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. అయితే తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఫిబ్రవరి 21న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ సంభాషణలు రాస్తుండటం విశేషం. సందీప్ కాకర్ల మరియు కరాటే రాజు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్, జపనీస్ మరియు స్పానిష్ వంటి అంతర్జాతీయ భాషల్లో కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.

## హీరోగా ఎంట్రీ ఇస్తున్న రామ్ చరణ్ మేనేజర్ కొడుకు



టాలీవుడ్ నుంచి హీరోల వారసులే కాకుండా, వారి వెన్నంటి ఉండే సన్నిహితుల కుటుంబాల నుంచి కూడా కొత్త టాలెంట్ వస్తుంటుంది. తాజాగా రామ్ చరణ్ డేట్స్, ఇతర సినిమా వ్యవహారాలను దశాబ్ద కాలంగా చూసుకుంటున్న ఆయన మేనేజర్ ప్రవీణ్ కుమారుడు దృషిక్ హీరోగా పరిచయం కాబోతున్నాడు. దృషిక్ చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తితో లండన్‌లోని ఒక ప్రముఖ యాక్టింగ్ స్కూల్‌లో శిక్షణ పొందినట్లు తెలుస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఆయన ఇప్పుడు ఒక క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా వెండితెరకు పరిచయం కాబోతున్నారు. బ్లాక్‌బస్టర్ హిట్ సిరీస్ అయిన 'మ్యాడ్' ఫ్రాంచైజీలో రాబోతున్న 'మ్యాడ్ 3' చిత్రంలో దృషిక్ ఒక హీరోగా ఎంపికైనట్లు తెలుస్తోంది. సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నిర్మిస్తున్న ఈ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌లో దృషిక్‌కి అవకాశం రావడం విశేషం. రామ్ చరణ్‌కు అత్యంత సన్నిహితుడైన ప్రవీణ్ కుమారుడు కావడంతో, ఈ కుర్రాడికి మెగా ఫ్యామిలీ మద్దతు కూడా ఉండవచ్చని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నటనతో పాటు డ్యాన్స్, ఫిట్‌నెస్‌లో కూడా దృషిక్ ఇప్పటికే మంచి పట్టు సాధించినట్లు సమాచారం.